క్లుప్తంగా

జీఎంకు ఆత్మీయ వీడ్కోలు



జీఎం దంపతులను సన్మానిస్తున్న సెక్యూరిటీ అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో 35 సంవత్సరాలు వివిధ ఏరియాల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన సింగరేణి కార్పొరేట్ సెక్యూరిటీ జీఎం బీఆర్ దీక్షితులును సోమవారం కార్పొరేట్ సెక్యూరిటీ అధికారులు సతీసమేతంగా ఘనంగా సన్మానించారు. సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్, ఎస్‌ఓటూ జీఎం వేణుగోపాల్ పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్లు నిర్మించండి..

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులో ప్రభుత్వ స్థలంలో పబ్లిక్ టాయిలెట్లు, వెంగన్నపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని నిర్మించాలని కోరుతూ బీఎస్పీ, గోర్ బంజారా పోరాట సమితి, టీడీపీ నాయకులు సోమవారం తహసీల్దార్ కె.స్వాతిబిందు, ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ రవికుమార్‌లకు వినతిపత్రాలు అందజేశారు. బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు, గోర్ బంజారా పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్, గార్లపాటి సైదులు, కారం బాబు ఉన్నారు.

వేలం వాయిదా

పాల్వంచరూరల్: పెద్దమ్మగుడి వద్ద బహిరంగ వేలంపాటలను వాయిదా వేసినట్లు ఈఓ ఎన్.రజనీకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో వ్యాపార దుకాణాలు, పూలదండల విక్రయాలు, తలనీలాలు పోగుచేసుకునేందుకు నిర్వహించాల్సిన బహిరంగ వేలం టెండర్లు వర్షాల కారణంగా వాయిదా వేసినట్లు తెలిపారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు.

చెరువును తలపిస్తున్న పాఠశాల ఆవరణ



కరివారిగూడెం ప్రభుత్వ పాఠశాలలో నిలిచిన వర్షపు నీరు

జూలూరుపాడు: వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి కరివారిగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో వరదనీరు నిలిచి చెరువును తలపిస్తోంది. శని, ఆదివారం కురిసిన వర్షానికి పాఠశాల ఆవరణంలో నీరు చేరింది. బయటకు వెళ్లే పరిస్థితి లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

కోతకు గురైన రాళ్లవాగు



వృథాగా పోతున్న నీళ్లు

పాల్వంచరూరల్: భారీ వర్షం కారణంగా రాళ్లవాగు పికప్ డ్యామ్ కోతకు గురై రెండురోజులుగా సాగునీరు వృథాగా బయటకుపోతోంది. పాల్వంచ మండలం రెడ్డిగూడెం సమీపంలోని రాళ్లవాగు పికప్ డ్యామ్‌కు వరద పోటెత్తడంతో ఆదివారం అలుగు పక్కన కోతకు గురికావడంతో డ్యామ్‌లోని నీరు వృథాగా బయటకు పోతోంది. దీని కింద 15 వందల ఎకరాల ఆయకట్టు ఉంది. రైతులు ఆందోళన చెందుతున్నారు. మరమ్మతులను చేపట్టాలని ఆయకట్టు రైతులు ఇరిగేషన్‌శాఖ అధికారులను కోరుతున్నారు. కోతకు గురైన రాళ్లవాగు పికప్ డ్యామ్‌ను సోమవారం జలవనరులశాఖ డీఈ చంద్రశేఖర్ పరిశీలించారు. నీటి ప్రవాహం తగ్గిన తర్వాత మరమ్మతులు నిర్వహిస్తామని తెలిపారు.

రహదారికి మరమ్మతులు

టేకులపల్లి: రెండు రోజులుగా కురిసిన భారీ వర్షం కారణంగా వరద తాకిడికి సంపత్‌నగర్ శ్మశానవాటిక సమీపంలో ఉన్న బీటీ రోడ్డు కోతకు గురైంది. దీంతో రాకపోలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. ఈ మార్గం గుండానే సంపత్‌నగర్, గంగారం, సిద్ధారం, మొట్లగూడెంతో పాటు ఆళ్లపల్లి మండలానికి రాకపోకలు సాగుతుంటాయి.

స్పందించిన బోడు ఎస్‌ఐ పోడిశెట్టి శ్రీకాంత్, ఆర్‌అండ్‌బీ ఏఈ మోతీలాల్ ఆధ్వర్యంలో సోమవారం మొరం, సిమెంట్, కంకర మిక్సింగ్‌తో రోడ్డుకు తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. గత సంవత్సరం కూడా వర్షాకాలంలో భారీ వర్షం కారణంగా ఇదే ప్రాంతంలో రోడ్డు కోతకు గురి కావడం విశేషం.

మహానేతకు జన నీరాజనం..



పాల్వంచ: నివాళులర్పిస్తున్న కొత్వాల శ్రీనివాసరావు, నాయకులు

కాంగ్రెస్ నాయకులు, అభిమానులు సోమవారం మహానేత, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. పలువురు మాట్లాడుతూ... ప్రజల అవసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా సంక్షేమ పథకాలకు రూపమిచ్చి షరతులు లేకుండా అర్హులందరికీ అమలు చేసిన ఘనత వైఎస్‌ఆర్ సొంతమని గుర్తుచేశారు. రైతులకు ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, రైతు బీమా అమలు చేసిన ఘనత అయనదేనన్నారు. ఆరోగ్యశ్రీ, 108, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లాంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని కొనియాడారు. రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమ రాజ్యంగా సృష్టించిన మహానుభావుడు డాక్టర్ వైఎస్‌ఆర్ అన్నారు. – సాక్షి నెట్‌వర్క్



జూలూరుపాడు: పూలమాల వేస్తున్న నాయకులు



ఇల్లెందు: వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య



చుంచుపల్లి: నివాళులర్పిస్తున్న నాయకులు



ఇల్లెందురూరల్: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



జూలూరుపాడులో...



ఇల్లెందురూరల్: సంజయ్‌నగర్‌లో అన్నదానం



సుజాతనగర్: నివాళులర్పిస్తున్న నాయకులు



అన్నదానం చేస్తున్న నాయకులు

కనీస వేతనాలు ఇవ్వాలి

పాల్వంచ: తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భట్టు చందు అన్నారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం అందించారు. మాట్లాడుతూ... సమగ్ర శిక్ష ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అర్జున్, వర్కింగ్ ప్రెసిడెంట్ కిషన్ పాల్గొన్నారు.

నేడు భవన నిర్మాణ కార్మికుల ధర్నా



మాట్లాడుతున్న కృష్ణ

ఇల్లెందురూరల్: సంక్షేమ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలను అమలు చేయాలని, ఆ బాధ్యతను ఇన్సూరెన్స్ సంస్థలకు అప్పగించేందుకు ప్రభుత్వం పిలిచిన టెండర్లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ తాళ్లూరి కృష్ణ డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులతో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం మరిన్ని పథకాలు అమలు చేయాల్సిన ప్రభుత్వం తన బాధ్యతలను విస్మరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ లేబర్ ఆఫీస్ వద్ద మంగళవారం నిర్వహించే ధర్నాకు భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. మన్యం మోహన్‌రావు, లక్ష్మణ్‌పాసి, నాగరాజు, మహమూద్, రాజు, శ్రీను పాల్గొన్నారు.

కార్మికులకు 35శాతం వాటా చెల్లించండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరంలో సాధించిన ఉత్పత్తిలో కార్మికులకు 35శాతం వాటా చెల్లించాలని కోరుతూ టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేం రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ మాట్లాడుతూ... ఈ ఆర్థిక సంవత్సరంలో కంపెనీ 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించిందని, వీటి ద్వారా సుమారు రూ.37 వేల కోట్ల టర్నోవర్ సాధించిందని, వీటిలో సుమారు రూ.4వేల కోట్లు నికరలాభాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో కార్మికులకు 35 శాతం వాటా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈ విన్నపాన్ని కంపెనీ సీఎండీకి అందేలా చూడాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన జీఎం ఉన్నతాధికారులకు తెలియపరిచి పరిష్కార మార్గం చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ కూసన వీరభద్రయ్య, గడప రాజయ్య, విజయ్‌కుమార్, రాసూరి శంకర్, రాజ్ కుమార్, వెంకటేశ్వర్లు, అశోక్, రాజేందర్, రఫీ, నాగరాజు, కరీం, సత్యనారాయణ, సురేష్, రామకృష్ణ, కోటి, కృష్ణ, సాంబమూర్తి, దేవ్‌సింగ్, గణేష్, రమేష్, కుమార్, పూర్ణ చందర్, చందు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



ఏరియా జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎస్పీకి ఫిర్యాదు

కొత్తగూడెంటౌన్: తన కుమారుడు మందా రాకేష్ మరణానికి కారణమైన డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సోమవారం కొత్తగూడెం పట్టణానికి చెందిన మందా వెంకటేశ్వర్లు, దళిత సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు ఎస్పీ రోహిత్‌రాజును కలిసి ఫిర్యాదు చేశారు. మాట్లాడుతూ.. మూడు రోజులు ఆస్పత్రిలో ఉంచుకుని చికిత్స చేయలేదని, డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అశ్విని మృతికి సంతాపం..



నివాళులర్పిస్తున్న నాయకులు

టేకులపల్లి: ఖమ్మం జిల్లా సింగరేణి మండలం గేట్ కారేపల్లి గంగారం తండాకు చెందిన వ్యవసాయ శాఖ సైంటిస్ట్ నునావత్ అశ్విని మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం వద్ద వరద ప్రవాహంలో కొట్టుకుని పోయి మృతి చెందింది. ఆమె మృతి పట్ల టేకులపల్లి మండలానికి చెందిన పలు పార్టీలు, సంఘాల నాయకులు సోమవారం రాత్రి టేకులపల్లి సెంటర్‌లో కొవ్వొత్తులతో సంతాపం తెలియజేశారు. భూక్యా లాలునాయక్, బోడ బాలునాయక్, బాలకృష్ణ, సాయి కృష్ణ, సురేష్, అనిల్, నోముల భానుచందర్, బన్సీలాల్, మంగీలాల్, హుస్సేన్ పాల్గొన్నారు.

బీమా చెక్కులు అందజేత

చుంచుపల్లి: కొత్తగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో ఇటీవల మరణించిన రైతుల కుటుంబాలకు సొసైటీ అధ్యక్షుడు మండె వీరహనుమంతరావు సొసైటీ కార్యాలయంలో సోమవారం బీమా చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కంటెం సత్యనారాయణ, గుగులోతు కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

పాల్వంచరూరల్: భారీవర్షాల కారణంగా వరద ముంపునకు గురైన గ్రామీణ ప్రాంత ప్రజలు అధైర్యపడొద్దని యుద్ధప్రాతిపదికన నష్టనివారణ చర్యలు ప్రారంభించామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలో వరద ముంపునకు గురైన కిన్నెరసాని, ఉల్వనూరు, మందేరకలపాడు, మల్లారం, యానంబైల్, రాళ్లవాగు ప్రాంతాలను సోమవారం ఎమ్మెల్యే సందర్శించారు. మందేరకలపాడు గ్రామవద్ద ప్రధాన రహదారిపై ఏర్పడ్డ గుంతను, వరద కారణంగా నష్టపోయిన పంటలను పరిశీలించారు. రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చివేసి రాకపోకలను పునరుద్ధరించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించడంతో స్పందించిన అధికారులు తాత్కాలికంగా మట్టితో పూడ్చివేశారు. వరద బాధిత కుటుంబాలను కలిసి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు నష్టపరిహారం చెల్లించేవిధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముంపు పరిస్థితులను గుణపాఠంగా తీసుకుని శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డి, విద్యుత్‌శాఖ డీఈ నందయ్య, జలవనరులశాఖ డీఈ చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా, ముత్యాల విశ్వనాథం, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, సాయిబాబా, బండి నాగేశ్వరరావు, రాహుల్, నాగరాజు, అన్నారపు వెంకటేశ్వర్లు, నాగసీతారాములు, మాజీ జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, యర్రంశెట్టి ముత్తయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



ఉల్వనూరులో వరద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) అనుబంధ భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకులు కెచ్చెల రంగారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు రూ.రెండు లక్షలు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేస్తున్నారని విమర్శించారు. రైతులకు పట్టాపాసు పుస్తకం లేదని, రేషన్ కార్డు లేదని, 2018 కంటే ముందు తీసుకున్నారని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. షరతులు లేకుండా రుణమాఫీ చేసి కొత్త రుణాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండురోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి రూ.50వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, వరదల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో అందజేశారు. ఈ కార్యక్రమంలో నాని రాజు, అమర్లపూడి రాము, బుర్ర వెంకన్న, గోకినపల్లి ప్రభాకర్, భానోత్ ధర్మ, నిమ్మల రాంబాబు, పి.లక్ష్మణ్, ఎస్.నాగేశ్వరరావు, నూపా సరోజిని, వి.పద్మ, పి.సతీష్, ఆర్.వెంకటేశ్వర్లు, డి.సాయిబాబు, వి.రమేష్, వి.బుచ్చిరాజు, వీరబాబు, ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

నోటరీ నోటిఫికేషన్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న లక్కినేని సత్యనారాయణ

కొత్తగూడెంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నోటరీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం కొత్తగూడెం జిల్లా కోర్టులోని లైబ్రరీ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణాలో దాదాపు 40 వేల మంది న్యాయవాదులు ప్రాక్టీస్ చేస్తున్నారని అందులో దాదాపు అందరూ మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు ఉన్నట్లు చెప్పారు. వారంతా పూర్తిగా ఈ వృత్తిపైనే ఆధారపడి ఉన్నారని, 2011 ఏడాదిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు విడదల చేసిన తరువాత ఇప్పటి వరకు నోటిఫికేషన్ రాలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నోటరీ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని కోరారు. దూదిపాల రవికుమార్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

‘రేపు చలో విద్యుత్ సౌధ’

పాల్వంచ: విద్యుత్ సంస్థల్లో మెరిట్ కమ్ సీనియారిటీ కల్పించాలని ఓసీ అసోసియేషన్ టీజీ జెన్‌కో అధ్యక్షుడు సందుపట్ల శ్రీనివాసరెడ్డి, బీసీ అసోసియేషన్ జెన్‌కో అధ్యక్షుడు కొమరవెల్లి రవీందర్ అన్నారు. సోమవారం స్థానిక కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్‌లో బీసీ, ఓసీ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన జరగనున్న చలో విద్యుత్ సౌధ మహా ధర్నాను విజయవంతం చేయాలి కోరుతూ వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. మెరిట్ కమ్ సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించాలన్నారు. జూన్ 2014 నుంచి కల్పించిన పదోన్నతులు సమీక్షించి, నష్టపోయిన బీసీ, ఓసీ ఉద్యోగులకు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆడెపు రమాకాంత్, ఎస్.కోటేశ్వరరావు, హరికృష్ణ, వినోద్‌బాబు, రాంబాబు, నరేందర్, టి.వెంకటేశ్వర్లు, సతీష్, రామారావు, సాంబయ్య, రంగా, శ్రీధర్, ఎస్.శ్రీనివాస్, ప్రసాద్, పుల్లారావు, రామకృష్ణ, శ్యామ్, గురువయ్య, శ్రీను, డోలి శ్రీనివాస్, నాగ రామ్‌కుమార్, సమ్మయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కూలిన పెద్దమ్మగుడి ప్రహరీ

పాల్వంచరూరల్: లక్షల వ్యయం చేసి నిర్మాణం చేసిన పెద్దమ్మతల్లి ఆలయానికి చెందిన ప్రహరీ పాక్షికంగా కూలిపోయింది. మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయం ఎదుట గల స్థలం చుట్టూ నాలుగు సంవత్సరాల క్రితం నిర్మించిన ప్రహరీ గోడ ఆదివారం కురిసిన భారీ వర్షానికి కూలిపోయింది.

పునరావాస కేంద్రానికి తరలిన బాధితులు





అల్పాహారం అందజేస్తున్న సిబ్బంది, రాత్రిపూట గదిలో కూర్చున్న వరద బాధిత కుటుంబాలు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని ఉల్వనూరు గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో రెండు రోజులుగా వరద బాధితులకు రెవెన్యూ శాఖ అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. ఉల్వనూరు గ్రామంలో ఆదివారం కురిసిన భారీ వర్షాలకు పొంగిపొర్లిన లొద్దిగండి వాగు సమీపంలోని నివాసాల్లోకి వరద నీరు చేరి సర్వం కోల్పోయిన 45కుటుంబాలకు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశాల మేరకు తహసీల్దార్ వివేక్ సోమవారం గ్రామంలో ఉన్న గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో ప్రత్యేకంగా ఆరుగదులను కేటాయించగా వరద బాధితులు 45కుటుంబాలకు చెందిన వంద మంది నివాసం ఉంటున్నారని వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రిపూట భోజనాలు అందిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటలు, రోడ్లు

జూలూరుపాడు: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. పత్తి, వరి, మిరప రైతులు తీవ్రంగా నష్టపోయారు. పెద్దవాగు, తుమ్మలవాగు, ఎదుళ్లవాగు, బండలవాగులు, వంకల పరివాహక ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మండల వ్యాప్తంగా 140 మంది రైతులకు చెందిన 233 ఎకరాల్లో పత్తి, 80 మంది రైతులకు చెందిన 135 ఎకరాల విస్తీర్ణంలోని వరి దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. అదేవిధంగా మిరప పంట పాక్షికంగా దెబ్బతిన్నది. ఈ విషయంపై మండల వ్యవసాయశాఖ అధికారి దీపక్ ఆనంద్‌ను వివరణ కోరగా.. మండలంలో 368 ఎకరాల విస్తీర్ణంలో పంటలు దెబ్బతిన్నట్లు తెలిపారు.

పాల్వంచ: వర్షాలకు పట్టణ పరిధిలో జనజీవనం అస్తవ్యస్తగా మారింది. పలుచోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. డ్రెయినేజీ వ్యవస్థ నిలిచిపోయింది. గుట్ట పైనుంచి వరద నీరు భారీ ఎత్తున ప్రవహించడంతో ఇందిరా కాలనీ, వనమా కాలనీ, వికలాంగుల కాలనీల్లో ఇళ్లు దెబ్బతిన్నాయి. సీసీ రోడ్ల పక్కనున్న మట్టి కొట్టుకుపోయింది.

పాల్వంచరూరల్: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు, వరదల కారణంగా మండలంలో 315 ఎకరాల పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయశాఖాధికారి శంభోశంకర్ తెలిపారు. కిన్నెరసాని నది పరివాహక ప్రాంతంలో, ఉల్వనూరులో పంటలను ఏఓ సోమవారం పరిశీలించారు.

పత్తి 250 ఎకరాలు, వరి 50 ఎకరాలు, మిర్చి 10 ఎకరాలు, మొక్కజొన్న ఐదు ఎకరాల్లో నష్టం వాటిల్లిందన్నారు. ఉల్వనూరు బంజర, నర్సింహాసాగర్ గ్రామాల్లో పత్తిపంట వరదలకు కొట్టుకపోగా, నాగారం, నారాయణరావుపేట గ్రామాల పరిధిలో వరిపంట కొట్టుకపోయింది.

పంటనష్టం సర్వే చేయాలి

భారీవర్షాలకు వరదల కారణంగా మండలంలో పంటలను నష్టంపై అధికారులు సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక పంపాలని మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. నాగారం, దంతలబోరు ఎస్సీ కాలనీలో సోమవారం వ్యవసాయ శాఖ అధికారితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా భారీ వర్షాల కారణంగా తరుచు రైతులు పంటలను నష్టపోతున్నారని అధికారులు వెంటనే పంట నష్టాన్ని సర్వే చేసి ప్రభుత్వం ఆదుకోనే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాలే జానికిరెడ్డి, యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, బాలినేని నాగేశ్వరరావు, సీహెచ్.పాపారావు, జలగం సత్యనారాయణ, చక్రం, కాటరాపు నాగయ్య, తెల్లం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: మండల కేంద్రంలోని ఎ కాలనీతండా – దుబ్బతండా బీటీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనాలకు శాపంగా మారింది. రాత్రివేళలో మరింత ప్రమాదకరంగా ఉంది. వ్యవసాయ సీజన్‌లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



పాల్వంచ: ఇందిరా కాలనీలో దెబ్బతిన్న రోడ్డు



పాల్వంచరూరల్: పత్తిపంటను పరిశీలిస్తున్న ఏఓ శంభోశంకర్



టేకులపల్లి: అధ్వానంగా మారిన బీటీ రోడ్డు